సాక్షి
నిజామాబాద్
గురువారం । 24 । ఏప్రిల్ । 2025



డిచ్‌పల్లి ఖిల్లాకు గుర్తింపు..

డిచ్‌పల్లి ఖిల్లా రామాలయానికి ఎకో టూరిజం ద్వారా ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తానని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.

- 10లో ▸



సెలవులొచ్చాయి..

వేసవి సెలవుల్లో పిల్లలు ఇంటి పట్టున ఉండరని, వారి కదలికలపై ఓ కన్నేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
44.5 /24.8

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వడ గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. వాతావరణం పొడిగా మారుతుంది.

న్యూస్‌రీల్

కామారెడ్డి ఇన్‌చార్జి డీఈవోగా అశోక్



దేశాయిపేట్‌లో తాను చదువుకున్న తరగతి గది వద్ద డీఈవో అశోక్

నిజామాబాద్ అర్బన్/బాన్సువాడ రూరల్: జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి డీఈవో పది రోజులపాటు సెలవులో వెళ్లడంతో అశోక్‌కు బాధ్యతలు అప్పగించారు.

చదివిన బడిని చూసి మురిసిన అధికారి..

దేశాయిపేట్ జెడ్పీ హైస్కూల్‌ను ఇన్‌చార్జి డీఈవో అశోక్ సందర్శించారు. ఆయన స్వస్థలం సోమేశ్వర్ గ్రామం. తాను చదువుకున్న దేశాయిపేట్ హైస్కూల్‌లో ఆయన కలియదిరిగారు. తాను ఇదే పాఠశాలలో ఏడో తరగతి వరకు చదువుకున్నట్లు తెలిపారు.

యువవికాసం దరఖాస్తుల పరిశీలన వాయిదా

నిజామాబాద్ సిటీ: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాల పరిశీలనను వాయిదా వేసినట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి సర్టిఫికెట్లు, ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్‌ను ఈనెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించాల్సి ఉండగా వాయిదాపడింది. తదుపరి తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుబ్బ ఏఎస్ 11 కేవీ ఎస్‌జీ ఫీడర్‌లో ఏబీ స్విచ్‌లు ఏర్పాటు కారణంగా ఉదయం 10 నుంచి 12 గంటల అంతరాయం ఏర్పడుతుందన్నారు. బైపాస్ రోడ్, గాడ్స్ కాలనీ, గుమాస్తా కాలనీ, మహేశ్వరి భవన్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుస్తుందని పేర్కొన్నారు.

పీసీసీ అబ్జర్వర్ల నియామకం

- జిల్లాకు బల్మూరి వెంకట్, తిరుపతి
- ఆదిలాబాద్‌కు తాహెర్ బిన్ హందాన్

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ జిల్లా అబ్జర్వర్లుగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కొటానక తిరుపతి నియమితులయ్యారు. ఏఐసీసీ, పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు జిల్లాలకు పీసీసీ అబ్జర్వర్లను నియమిస్తూ పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ జాబితా విడుదల చేశారు. ఆదిలాబాద్‌కు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందన్‌ను నియమించారు. అబ్జర్వర్లుగా వెంటనే ఆయా జిల్లాలకు వెళ్లి పార్టీ జిల్లా అధ్యక్షులతోపాటు మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పీసీసీ డెలిగేట్‌లు, జిల్లా మాజీ అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

సలహాలు స్వీకరించి అనుభవాలు పంచుకొని..



రైతు మహోత్సవంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ స్టాల్‌ను పరిశీలిస్తున్న వీసీ జానయ్య

ముగిసిన రైతు మహోత్సవం

- ఉత్సాహంగా పాల్గొన్న అన్నదాతలు.. కిటకిటలాడిన స్టాళ్లు
- ఆధునిక సాగుపై సలహాలు, సూచనలు అందించిన శాస్త్రవేత్తలు, నిపుణులు
- నూతన పద్ధతులపై అనుభవాలను పంచుకున్న ఆదర్శ రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మూడు రోజులపాటు జరిగిన రైతు మహోత్సవం వేడుక విజయవంతంగా ముగిసింది. చివరి రోజు బుధవారం నిజామాబాద్‌తోపాటు కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పండుగ వాతావరణం కనిపించింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన 130కు పైగా స్టాల్స్ కిటకిటలాడాయి. రైతులు, వారు పండించిన ఉత్పత్తులతోపాటు వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పత్తులు, ఆధునిక సాగు పరికరాలు, అధిక దిగుబడులను అందించే వంగడాలు, మేలు జాతి పాడి పశువులు తదితర వాటిని స్టాళ్లలో ప్రదర్శించగా, రైతులు ఆసక్తిగా తిలకించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖ శాస్త్రవేత్తలు, నిపుణులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన యూనివర్సిటీ, ఇతర వ్యవసాయ పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలు మూడు రోజులపాటు కొనసాగిన వర్క్‌షాపులో ఆయా అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ఏ జానయ్య, వివిధ విభాగాల అధిపతులు శ్రీలత, అంజయ్య, చంద్రశేఖర్, ప్రవీణ్, శివకృష్ణ, శాస్త్రవేత్తలు రాజ్ కుమార్, శ్వేత, రాజశేఖర్, విజయ్, స్వప్న తదితరులు పంటల సాగులో పాటించాల్సిన మెళకువలు, సస్యరక్షణ చర్యలు, ఆధునిక వ్యవసాయం, భూసారం పెంపుదల, అధిక దిగుబడులను అందించే వంగడాలు, తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలను సాధించేందుకు అవలంబించాల్సిన పద్ధతులు, వాణిజ్య పంటల ఎంపికకు పరిశీలించాల్సిన అంశాలపై సెషన్ల వారీగా రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పురస్కారాలు అందుకున్న అభ్యుదయ రైతులతోపాటు రైతు ఉత్పాదక సంస్థల ప్రతినిధులు సైతం రైతు మహోత్సవం వేదిక ద్వారా తమ అనుభవాలు పంచుకున్నారు.



వీసీ జానయ్యను సన్మానిస్తున్న వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్

స్టాళ్లను సందర్శించిన కలెక్టర్, కార్పొరేషన్ల చైర్మన్లు

ముగింపు సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీబీ చైర్మన్ రమేశ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి తదితరులు స్టాళ్లను సందర్శించారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన నిజామాబాద్ జిల్లాలో రైతు మహోత్సవ వేడుక నిర్వహించడంతో స్థానిక రైతులతోపాటు జిల్లాకు ఆనుకొని ఉన్న కామారెడ్డి, జగిత్యాల, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల రైతులకు కూడా ఎంతో ప్రయోజనం చేకూర్చిందని కలెక్టర్ అన్నారు. ఇక్కడ పరిశీలించిన అంశాలు, నూతన సాగు విధానాలను రైతులు గ్రామాలలోని సహచర రైతులకు తెలియజేస్తూ వారిని కూడా అధిక దిగుబడుల సాధన దిశగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



తెలంగాణ అగ్రి కల్చరల్ యూనివర్సిటీ వీసీ జానయ్యతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత స్థలం పరిశీలన

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండల కేంద్రంతోపాటు మనోహరాబాద్, కొలిప్యాక్, తొర్లికొండ, అర్గుల్ గ్రామాల పరిధిలో ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత స్థలాన్ని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతినిధుల బృందం (ముగ్గురు సభ్యులు) బుధవారం పరిశీలించింది. ఐదేళ్ల క్రితం స్థలాన్ని తమ బృందం పరిశీలించిందని, అయితే ఏవైనా మార్పులు జరిగాయా అని తెలుసుకునేందుకు మళ్లీ పరిశీలించి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. తొర్లికొండ శివారులోని చెరువు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిపాదిత స్థలం 44వ నంబర్ జాతీయ రహదారికి ఎన్ని కిలోమీటర్ల దూరంలో ఉంటుందని స్థానిక అధికారులను ప్రశ్నించారు. ప్రతిపాదిత స్థలం ప్రస్తుత పరిస్థితిని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు పంపిస్తామని వారు తెలిపారు. వారి వెంట అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ కిరణ్మయి, డిప్యూటీ తహసీల్దార్ దత్తాద్రి, ఏడీ సర్వే అశోక్, డీఐ జగన్నాథ్, ఆర్ఐ ప్రవీణ్, సర్వేయర్లు రత్నాకర్, దానియల్ తదితరులున్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ప్రతినిధుల బృందం

వివాదాలకు శాశ్వత పరిష్కారం

- పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం
- భూ భారతి పోర్టల్‌పై సలహాలు, సూచనలు అందించాలి
- అవగాహన సదస్సుల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

రుద్రూర్: భూ సంబంధిత సమస్యలను పరిష్కరించడంతోపాటు రైతులకు భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. భూ భారతి చట్టంపై మోస్రా, చందూర్ మండల కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి చట్టంతో రైతులకు, పేదలకు మేలు కలుగుతుందని అన్నారు. భూ వివాదాల్లో కోర్టుకు వెళ్లే పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందుతుందన్నారు. అసైన్‌మెంట్ భూములకు సంబంధించి కూడా త్వరలోనే ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలను జారీ చేయనుందని తెలిపారు. రైతుల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. భూ భారతి చట్టంపై సలహాలు, సూచనలు చేయాలని రైతులను కోరారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూ భారతి చట్టంలోని సెక్షన్లను వివరించారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ మారుతి, ఎంపీడీవో శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ కె లక్ష్మణ్, సింగిల్ విండో చైర్మన్‌లు సుధాకర్‌రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

- ప్రత్యేక బృందాలతో స్కానింగ్ సెంటర్ల తనిఖీ
- డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: పీసీ పీఎన్‌డీటీ చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి బద్దం రాజశ్రీ స్పష్టం చేశారు. వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో బుధవారం జిల్లా స్థాయి సలహా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. జిల్లాలోని మూడు డివిజన్‌లలో ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీసీ పీఎన్‌డీటీ చట్టాన్ని అతిక్రమించే, అర్హతలేని వ్యక్తుల రిఫరెన్స్‌పై స్కానింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి స్కానింగ్ సెంటర్ రిజిస్టర్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలన్నారు. బోధన్‌లో స్కానింగ్ యంత్రం ఉన్న ఆస్పత్రి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. జిల్లాలో కొత్తగా రెండు ఆస్పత్రుల్లో స్కానింగ్ యంత్రాలకు అనుమతించామన్నారు. సలహా సంఘం కమిటీ సభ్యులు వైద్యులు సుప్రియ, బిందు, హరిప్రియ, రేడియాలజిస్ట్ శ్రావణి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, సీడీపీవో సౌందర్య, ఎన్జీవో పద్మాసింగ్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధ, మెప్మా డీఎంసీ మాధవీలత, నాగలక్ష్మి, వేణుగోపాల్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

ఎండ @ 45.3 డిగ్రీలు

- జిల్లాపై భానుడి ప్రతాపం
- వేగంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

నిజామాబాద్ అర్బన్: జిల్లాపై భానుడి ప్రతాపం రోజురోజూ పెరుగుతోంది. బుధవారం రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలోని నందిపేట మండలం సీహెచ్ కొండూర్‌లో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా జిల్లా సగటు ఉష్ణోగ్రత 44.5 డిగ్రీలుగా ఉంది. గతేడాది ఇదే రోజు నిజామాబాద్ నార్త్ మండలంలో 43.3 డిగ్రీలు నమోదైంది. గత వారం రోజుల్లో 40 డిగ్రీల నుంచి 45 డిగ్రీలకు ఉష్ణోగ్రత పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం జిల్లా రెడ్‌జోన్‌లో కొనసాగుతోంది.

పొద్దు పోతలేదు

- అలాట్‌మెంట్ లేక నిలిచిన సన్‌ఫ్లవర్ కొనుగోళ్లు
- భారీగా పంట దిగుబడి
- అకాల వర్షం నేపథ్యంలో అన్నదాతల్లో గుబులు



హున్సాలో పూర్తిగా ఎండిన సన్‌ఫ్లవర్ గింజలను చూపుతున్న రైతు సిద్ధూరాం

బోధన్ : ఓ వైపు కొనుగోళ్లలో జాప్యం.. మరోవైపు అకాల వర్షంతో పొద్దు తిరుగుడు(సన్‌ఫ్లవర్) రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పొద్దుతిరుగుడు గింజలను కోసి ఆరబోసి కుప్పలు చేశారు. అలాట్‌మెంట్ లేకపోవడంతో కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని వేచిచూస్తున్నారు.

ఐదు కొనుగోలు కేంద్రాలు

బోధన్, సాలూర, పాతంగల్, కల్దుర్కి, హున్సా సొసైటీల ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కేంద్ర ప్రభుత్వం తన వాటాగా జిల్లాలో 234 టన్నుల సేకరణకు అలాట్‌మెంట్ ఇవ్వగా.. హున్సా మినహా నాలుగు కొనుగోలు కేంద్రాల్లో మొత్తం 225 టన్నులు కొనుగోలు చేశారు. హున్సా సొసైటీకి ఇప్పటి వరకు అలాట్‌మెంట్ ఇవ్వకపోవడంతో ఒక్క గింజా కొనుగోలు చేయలేదు. యాసంగి సీజన్‌లో 3,500 నుంచి 4 వేల ఎకరాల విస్తీర్ణంలో సన్‌ఫ్లవర్ సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అంచనా. కోటగిరి, పొతంగల్, సాలూర, బోధన్ మండలాల్లో భారీ విస్తీరణంలో పొద్దుతిరుగుడు సాగు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ కోటా కోసం నిరీక్షణ

కేంద్ర ప్రభుత్వ అలాట్‌మెంట్ మేరకు దాదాపు కొనుగోళ్లు పూర్తికాగా, రాష్ట్ర ప్రభుత్వ కోటా రావాల్సి ఉందని మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. రైతుల వద్ద వందలాది క్వింటాళ్ల సన్‌ఫ్లవర్ నిల్వలు ఉన్నాయి. హున్సా సొసైటీ పరిధిలో 2 వేల క్వింటాళ్లు, సాలూర సొసైటీ పరిధిలో 500 క్వింటాళ్ల వరకు నిల్వలు ఉన్నాయి. దిగుబడి మొత్తం 900 టన్నుల మేర ఉంటుందని మార్క్‌ఫెడ్ అంచనా వేసినట్లు తెలుస్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో దిగుబడులు చూస్తే భారీ స్థాయిలో వ్యత్యాసం కనిపిస్తోంది.

కొనుగోలు కేంద్రాలకే మొగ్గు..

కేంద్ర ప్రభుత్వం సన్‌ఫ్లవర్ క్వింటాల్‌కు రూ.7,280 మద్దతు ధర ప్రకటించగా, బయటి మార్కెట్‌లో రూ.4 వేలు పలుకుతోంది.

దీంతో కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేందుకు రైతులు పడిగాపులు కాస్తున్నారు. 530 టన్నుల అలాట్‌మెంట్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని మార్క్‌ఫెడ్ అధికారులు అంటున్నారు.

వర్షం కురిస్తే నష్టపోతాం

నెలన్నర క్రితం పంట కోసి కొనుగోలు కేంద్రానికి తెచ్చా. సొసైటీలో కొనుగోలు చేయడం లేదు. అకాల వర్షం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వర్షం కురిస్తే తీవ్రనష్టం వాటిల్లుతుంది.

– సిద్ధూరాం, రైతు, హున్సా, సాలూర

8 క్వింటాళ్ల దిగుబడి



ఎకరం భూమిలో పొద్దుతిరుగుడు సాగుచేశా. ఎనిమిది క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. సొసైటీలో ఎప్పుడు కొనుగోలు చేస్తారో తెలియడం లేదు. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించి ఆదుకోవాలి. – గంగారాం, రైతు, హున్సా

పహల్గాం ఘటన పిరికిపంద చర్య



జిల్లా కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు




ర్యాలీలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్, పల్లె గంగారెడ్డి, నాయకులు

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా జిల్లాలో ర్యాలీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో బీజేపీ నగర శాఖ, టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించగా, జిల్లా కోర్టు వద్ద న్యాయవాదులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఇది పిరికిపంద చర్య అని మండిపడ్డారు. బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఉగ్రవాదుల చేతుల్లో హతమైన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలపాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు. – ఖలీల్‌వాడి/సుభాష్‌నగర్

పడిపోయిన నువ్వుల ధర

- రూ.13,700 నుంచి రూ.9,700కు..
- క్వింటాల్‌కు రూ.4 వేల వరకు తగ్గిన రేటు
- ప్రధాన మార్కెట్ మహారాష్ట్రలోని పుణేలో..
- ఏపీ, గుజరాత్ నుంచి అక్కడికి దిగుబడులు
- తెలంగాణ నువ్వులకు తగ్గిన డిమాండ్



మోర్తాడ్(బాల్కొండ): నువ్వుల ధర పడిపోవడంతో పంట సాగు చేసిన రైతుల ముఖాల్లో నవ్వులు కరువయ్యాయి. యాసంగి సీజన్‌లో సాగు చేసిన నువ్వులకు ఆశించిన ధర లభించడం లేదు. గతేడాదితో పోలిస్తే క్వింటాల్‌కు రూ.4వేల వరకు ధర పడిపోయింది. కరోనా కాలంలో నువ్వులకు గిరాకీ, ధర పెరిగింది. దీంతో సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. ఈ సీజన్‌లో జిల్లాకు చెందిన రైతులు సుమారు రెండున్నర వేల ఎకరాల విస్తీర్ణంలో పంట సాగు అయినట్లు అంచనా. నువ్వులకు ప్రధాన మార్కెట్ పుణే కాగా అక్కడికి ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతుండడంతో తెలంగాణ నువ్వులకు డిమాండ్ తగ్గింది. గతేడాది స్థానికంగా క్వింటాల్‌కు గరిష్టంగా రూ.13,700 చెల్లించిన వ్యాపారులు ఈ ఏడాది మాత్రం రూ.9,700 నుంచి రూ.10వేల వరకు చెల్లిస్తున్నారు. తెలంగాణలో సాగు చేస్తున్న నువ్వులకు డిమాండ్ తగ్గిపోవడంతో ధర పడిపోయిందని వెంకటేశ్ అనే వ్యాపారి 'సాక్షి'కి తెలిపారు. ఏకంగా రూ.4వేల వరకు ధర తగ్గిపోవడంతో నువ్వులు సాగు చేసిన రైతులకు లాభాలు పడిపోయి శ్రమకు తగిన ప్రయోజనం లేకుండా పోయింది.

క్లుప్తంగా

రావుల మధుకు డాక్టరేట్



రావుల మధుకు పీహెచ్‌డీ ప్రదానం చేస్తున్న ప్రొఫెసర్లు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం పరిశోధక విద్యార్థి రావుల మధు పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. వర్సిటీ అధ్యాపకుడు వాసం చంద్రశేఖర్ పర్యవేక్షణలో 'ప్రిపరేషన్ డెవలప్‌మెంట్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ నావెల్ నానో క్రిస్టలైన్ సిరియా బేస్డ్ ఎట్రోజీనియస్ క్యాటలిస్ట్ ఫర్ ది కటలిటీక్ ఎవాల్యూషన్ ఆఫ్ సెలెక్టివ్ ఆక్సిడేషన్ ఆఫ్ ఆరోమాటిక్ అమైన్స్' అనే అంశంపై మధు పరిశోధన జరిపారు. బుధవారం నిర్వహించిన బహిరంగ మౌఖిక పరీక్షకు కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ టీ సవిత జోత్స్న ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో వర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ మావ్రపు సత్యనారాయణ రెడ్డి, సైన్స్ డీన్ ఆచార్య కే సంపత్ కుమార్, బోయపాటి శిరీష, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న ఎస్సై

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా 50 మంది పోలీసులతో బుధవారం తనిఖీలు నిర్వహించారు. శాంతినగర్, ఖిల్లా, వర్ని చౌరస్తా, బాబన్ సహబ్ పహాడీ ఏరియాల్లోని అనుమానితుల ఇండ్లను డాగ్‌స్క్వాడ్ బృందాలతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలు లేని, మైనర్ డ్రైవింగ్ చేస్తున్న 17 వాహనాలను సీజ్ చేశారు. నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, టీఎస్ఎస్పీ స్టాఫ్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు పదోన్నతి

ఖలీల్‌వాడి: బాసర జోన్‌లో పనిచేస్తున్న పలువురు సివిల్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు బాసర జోన్ డీఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జోన్ పరిధిలో మొత్తం 28 మంది కానిస్టేబుళ్లకు ప్రమోషన్ కల్పించగా, జిల్లాలో పని చేస్తున్న 15 మంది కానిస్టేబుళ్లు పదోన్నతి పొందారు. వీరిలో కొందరిని జగిత్యాలకు బదిలీ చేశారు.

అన్నదాతలకు ఉపయోగకరం



రైతు మహోత్సవంలో స్టాళ్లను పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేశ్ రెడ్డి

సుభాష్‌నగర్/ డొంకేశ్వర్: జిల్లాలో ఏర్పాటు చేసిన రైతు మహోత్సవం.. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని రైతాంగానికి ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి పేర్కొన్నారు. రైతు మహోత్సవం స్టాళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. జిల్లాలో రైతు మహోత్సవం ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలతోపాటు దేశీ రకాలు, ఇతర లాభదాయకమైన పంటలను సాగు చేసి లాభాలు ఆర్జించాలని సూచించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు చైర్మన్‌ను సన్మానించారు.



స్టాల్‌ను సందర్శిస్తున్న సీపీ సాయిచైతన్య

వ్యవసాయం లాభసాటిదే...



వ్యవసాయం రంగం సంక్షోభంలో ఉందనేది అపోహ మాత్రమే. ఎంతో మంది రైతులు వ్యవసాయాన్ని పండుగ చేసుకొని లాభసాటిగా మార్చుకున్నారు. ప్రభుత్వం కూడా పంటలు సాగు చేస్తున్న రైతులకు మద్దతు ధర, బోనస్, రుణమాఫీ లాంటి పథకాలు అందిస్తోంది. రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచడానికి రైతు మహోత్సవం చక్కని వేదికగా మారింది. రైతులు కేవలం వరి పంటనే కాకుండా ఆరుతడి పంటలను పండించాలి.

– జానయ్య, వీసీ, తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ

మేలైన విత్తనాలు అందజేస్తాం



తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా రైతులకు మేలైన విత్తనాలు అందజేస్తాం. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు 10లక్షల విత్తనాలు అందజేయాలని నిర్ణయించాం. రైతులు ప్రైవేటు కంపెనీల మాయమాటలను నమ్మి హైబ్రీడ్ విత్తనాలను వేసి దిగుబడిని నష్టపోతున్నారు. దీంతో పంటలు రోగాలను తట్టుకోవడం లేదు.

– అన్వేశ్‌రెడ్డి, తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్

పండుగను తలపించింది



మూడు రోజులపాటు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన రైతు మహోత్సవం పండుగను తలపించింది. మన జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాల నుంచి కూడా రైతులు వచ్చి స్టాళ్లను తిలకించారు. సాగులో ఎన్నో కొత్త విషయాలను తెలుసుకున్నారు. మహోత్సవాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

– గడుగు గంగాధర్, రైతు కమిషన్ సభ్యులు

సేంద్రియ పద్ధతిలో సాగుచేయాలి



మాది కూడా వ్యవసాయ కుటుంబమే. సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేసేవాళ్లం. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలన్నీ రసాయనాలతో సాగు చేస్తున్నారు. వీటిని తినడంతో వ్యాధులు వస్తున్నాయి. సేంద్రియ ఎరువులను పంటలకు వేస్తే ఆరోగ్యానికి మేలు కలుగుతుంది.

– డాక్టర్ కవితా రెడ్డి, గైనకాలజిస్టు

నకిలీ విత్తనాలను అరికట్టాలి



ప్రతీ ఏడాది సోయా పంటను సాగు చేస్తున్నాం. అనుకున్న దిగుబడి రావడం లేదు. కనీస మద్దతు ధరా దక్కడం లేదు. దళారులే లాభాలు పొందుతున్నారు. నకిలీ విత్తనాలను అరికట్టి, ప్రభుత్వమే నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలి. పసుపు పంటకు సాంగ్లీ మార్కెట్‌లో లభిస్తున్న ధరను నిజామాబాద్‌లో అందించాలి.

– బార్ల భూలక్ష్మి, మహిళా రైతు, డొంకేశ్వర్

అదిరేటి 'హెయిర్' స్టైల్







సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఫ్యాషన్‌కు కాదేదీ అనర్హం అనేది నానుడిగా మారిపోయింది. ఇక మహిళలే కాదు మగవాళ్లు, చిన్నారులు సైతం హెయిర్ స్టైల్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. హెయిర్ కేర్‌తోపాటు ట్రెండ్‌కు తగినట్లు ఫ్యాషన్‌గా కనిపించేందుకు నచ్చిన రీతిలో హెయిర్ స్టైల్స్ చేయించుకుంటున్నారు. బుధవారం నిజామాబాద్‌లో రైతు మహోత్సవ వేదిక వద్ద ఇద్దరు యువకులు, ఒక బాలుడు తమ హెయిర్ స్టైల్స్‌తో ప్రత్యేక ఆకర్షణగా కనిపించారు. ఓ అగ్రికల్చర్ విద్యార్థి నెత్తి పైభాగంలో మొక్క మాదిరిగా పిలక వేసుకున్నాడు. మరో యువ అధికారి మహిళల జడ మాదిరిగా వెనుక పొడవైన జుట్టుతో కనిపించాడు. మరొక బాలుడు ఎడమవైపు పూర్తిగా జుట్టు లేకుండా మధ్యలో ఒత్తుగా ఉండేలా కటింగ్ చేయించుకున్నాడు.

డిచ్‌పల్లి ఖిల్లాకు గుర్తింపు తెస్తా..

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి: జిల్లాలో ప్రసిద్ధి చెందిన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయానికి ఎకో టూరిజం ద్వారా రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. త్వరలో బాసర టూరిజం సర్క్యూట్‌లో డిచ్‌పల్లి రామాలయాన్ని చేర్చుతామని వెల్లడించారు. బుధవారం డిచ్‌పల్లి రామాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రామాలయంపై తీసుకున్న ప్రతి నిర్ణయం విజయవంతమైందని, తాను నామినేషన్ వేసే ముందు ఈ గుడికి వచ్చి వెళ్లగా, ఎమ్మెల్యేగా విజయం సాధించినట్లు తెలిపారు. ఆలయాభివృద్ధికి ప్రత్యేక నిధులను తీసుకువస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం నూతన చైర్మన్‌గా జంగం శాంతయ్య, డైరెక్టర్లుగా నర్సారెడ్డి, జితేందర్, పోశెట్టి, మాధురి, ఆలయ ప్రధాన అర్చకులు సుమిత్ శర్మలతో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల ప్రమాణ స్వీకారం చేయించారు. నాయకులు బూస సుదర్శన్, పీ మహేందర్ రెడ్డి, నర్సారెడ్డి, రాములు, సాయిలు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరు గ్రామాల్లో రూ.11.69కోట్లతో..

గత ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి తెలిపారు. గ్రామాల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకుల మోసపూరిత మాటలను ప్రజలు నమ్మవద్దని కోరారు. మండలంలోని మిట్టపల్లి, రాంపూర్, నర్సింగపూర్, కమలాపూర్, డిచ్‌పల్లి, ఘన్‌పూర్ గ్రామాల్లో రూ.11.69 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, మాజీ ఎంపీపీలు కంచెట్టి గంగాధర్, నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలసాని శ్రీనివాస్, నాయకులు తారాచంద్, వాసు బాబు, ధర్మాగౌడ్, మురళి చిన్నయ్య, రామకృష్ణ, షాదుల్లా, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ నూతన చైర్మన్, సభ్యులతో ఎమ్మెల్యే భూపతిరెడ్డి

జాన్కంపేటలో చోరీ

- 5 తులాల బంగారం, రూ.5 వేల నగదు అపహరణ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తు దుండగులు ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. జాన్కంపేట్ గ్రామంలోని 7వ వార్డులో నివసిస్తున్న పారిపల్లి శంకర్ కుటుంబసభ్యులు వేసవికాలం నేపథ్యంలో ఉక్కపోత భరించలేక తలుపులు తెరిచి నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉన్న 3 తులాల బంగారంతోపాటు 5 వేల నగదు అపహరించారు. అనంతరం ఆరు బయట నిద్రిస్తున్న శంకర్ భార్య రుక్మాబాయి మెడలో నుంచి సుమారు 2 తులాల పుస్తెలతాడును దొంగిలించుకొని వెళుతుండగా అలికిడి కాగా నిద్ర నుంచి తేరుకున్న కుటుంబసభ్యులు దొంగను చూసి వెంబడించారు. దొంగ దొరకకపోవడంతో బుధవారం ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

క్రైం కార్నర్

లింగంపేటలో మహిళ దారుణ హత్య

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రానికి చెందిన అమ్ముల లక్ష్మి(40) అనే మహిళను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. లక్ష్మి భర్త కొంతకాలం క్రితం మృతి చెందడంతో కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. ఆమెకున్న ఒక్కాగానొక్క కూతురు శిరీషకు పెళ్లి చేసి పంపడంతో లక్ష్మి మాత్రమే ఇంట్లో ఉంటోంది. ఈ నెల 20న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చీరతో గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం ఇంటికి తాళం వేసి వెళ్లగా, బుధవారం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తాళం పగులగొట్టి తలుపులు తెరిచి చూడగా లక్ష్మి మృతదేహం కుళ్లిపోయినట్లు గుర్తించారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆనవాళ్లు సేకరించారు. మృతురాలి కూతురు శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ పరిశీలించారు.



డాగ్‌స్క్వాడ్‌తో గాలిస్తున్న పోలీసులు

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య



శోభ (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎక్కపల్లి గ్రామానికి చెందిన ల్యాగల శోభ(45) అనే మహిళ బుధవారం ఉరేసుకొని మృతి చెందినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. గత నాలుగైదు సంవత్సరాలుగా శోభ మతిస్థిమితం కోల్పోయి వింతగా ప్రవర్తించేదని, ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా తగ్గలేదు. మంగళవారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో బాత్‌రూమ్ వద్ద ఉన్న కర్రకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. భర్త పర్వయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

రెంజల్(బోధన్): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురికి జైలు శిక్ష విధించగా మరో ముగ్గురికి బోధన్ ద్వితీయ శ్రేణి అదనపు న్యాయమూర్తి జరిమానా వేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం సాటాపూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా తాగి వాహనాలు నడిపిన వారిని పట్టుకొని కేసు నమోదు చేసి బుధవారం కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు. ముగ్గురికి రెండు రోజుల జైలు, మరో ముగ్గురికి రూ.4 వేల చొప్పున జరిమానా విధించారు.

కిరాణా షాప్ యజమానికి..

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్దేశిత సమయానికి మించి కిరాణాదుకాణాన్ని తెరిచి ఉంచిన యజమాని షేక్ జుబేర్ హాజీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాసీన్ ఆరా ఫత్ బుధవారం తెలిపారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

హత్య కేసు కొలిక్కి!

రామారెడ్డి: రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి హత్య కేసు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ధర్పల్లి మండలం దొనకల్ అటవీ ప్రాంతంలో మృతుడి ఎముకలను నిందితుల ద్వారా గుర్తించినట్లుగా తెలిసింది. కాగా, ఈ హత్య 2024 ఫిబ్రవరి నెలలో జరిగినట్లు సమాచారం. మృతుడు గల్ఫ్ వెళ్లినట్లుగా బంధువులను నమ్మించిన భార్య..ప్రియుడితోపాటు మరో ఇద్దరితో కలిసి హత్య చేసినట్లుగా పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఈ హత్య కేసుపై రామారెడ్డి ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా గురువారం వరకు పూర్తి వివరాలు వెల్లడిస్తామని, ప్రస్తుతం కేసు విచారణలో ఉందని తెలిపారు. కాగా, పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి నిందితులకు శిక్షపడేలా ఆధారాలు సేకరించాలని మృతుడి సోదరుడు, బంధువులు కోరుతున్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

రెంజల్(బోధన్): మండలంలోని దూపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గ్రామంలోని కల్లు బట్టి పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి, కానిస్టేబుళ్లు గంగాధర్, సుబ్రమణ్యం, జావేద్, నర్సయ్యలతో కలిసి దాడి చేసినట్లు పేర్కొన్నారు. పేకాడుతున్న వారి నుంచి రూ. 11.820 నగదుతోపాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు ఎస్సై చేసినట్లు చెప్పారు.

సెలవులొచ్చాయి.. పిల్లలు జాగ్రత్త!



ఖలీల్‌వాడి: ఇంటర్, పదోతరగతి పరీక్షలు పూర్తయ్యాయి. గురువారం నుంచి పాఠశాలలకూ సెలవులు ప్రారంభమయ్యాయి. దీంతో పిల్లలు ఇంటి పట్టున ఉండేందుకు ఇష్టపడరు. మధ్యాహ్నం వేళలో ఆటలాడుతూ ఎండదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. సరదాగా స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంటుంది. ఈ తరుణంలో పిల్లల కదలికలపై ఓ కన్నేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

బండి ఇవ్వొద్దు.. బాధపడొద్దు

పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇచ్చిన రోడ్లపై తిరుగనివ్వొద్దు. రోడ్డు ప్రమాదాలతో ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. ప్రమాదం సంభవిస్తే పిల్లలతోపాటు తల్లిదండ్రులు, వాహన యజమానికి కోర్టు శిక్ష విధించే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటికే మైనర్ డ్రైవ్ కేసులు మొదలయ్యాయి.

ఆడపిల్లలను ఎక్కడా ఉంచొద్దు..

ఆడపిల్లలపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలి. టీనేజీ పిల్లలను స్నేహితులు, తెలిసిన వారి ఇండ్ల వద్ద ఉంచొద్దు. ఎక్కువగా ఫోన్లలో మాట్లాడుతుంటే తల్లిదండ్రులు దృష్టిసారించాలి. గారాబం చేయకుండా వారికి అర్థమయ్యేలా ప్రేమతో చెప్పాలి.

ఈతతో జాగ్రత్త..

పిల్లలు సరదాగా స్నానం చేసేందుకు చెరువులు, కాలువలు, బావుల వద్దకు వెళ్లాలని యోచిస్తారు. స్నానం కోసం బయటికి వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి.ఈత నేర్పించాలనుకుంటే మాత్రం తగిన శిక్షకుడు ఉండే స్విమ్మింగ్ పూల్‌కు పంపించండి.

స్నేహితులెవరో తెలుసుకోండి..

పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారు.. వారికి ఉన్న అలవాట్లను తెలుసుకోవాలి. చెడు స్నేహాలతో బైక్‌లపై తిరగడం, సిగరెట్లు, మద్యం అలవాటు చేసుకునే ప్రమాదం ఉంది. వ్యసనాలకు బానిసై గొడవలు, దొంగతనాలు చేసే అవకాశాలుంటాయి. దీంతో పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుంది.

సెల్‌ఫోన్‌కు బానిసలను చేయొద్దు

చాలా మంది పిల్లలు సెల్‌ఫోన్లకు బానిసలవుతున్నారు. సెలవుల్లో ఉదయం నుంచి రాత్రి నిద్రించే వరకు ఫోన్లతోనే గడుపుతారు. దీంతో పిల్లల్లో చురుకుదనం తగ్గిపోతుందని డాక్టర్లు చెబుతున్నారు. సెల్‌ఫోన్లకు బదులు ఆరుబయట ఆటలపై శ్రద్ధ కనబర్చేలా ఏర్పాట్లు చేయాలి. సెల్ వాడకంతో ఆన్‌లైన్‌లో వచ్చే గేమ్స్ ఆడి సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకునే ప్రమాదం ఉంది.

సమగ్ర శిక్ష ఉద్యోగుల రీఎంగేజ్

- నేడు తొలగింపు.. 28న తిరిగి విధుల్లో చేర్చుకోవాలని ఆదేశాలు
- పీటీఐల రీఎంగేజ్‌పై వెలువడని ఉత్తర్వులు

ఆర్మూర్: సమగ్ర శిక్ష ప్రాజెక్టు పరిధిలోని జిల్లా, మండల స్థాయిలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఈ నెల 24న విధుల నుంచి తొలగించాలని సూచిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, సమగ్ర శిక్ష ఎక్స్ అఫిషియో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉద్యోగులు బుధవారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి విధుల నుంచి తొలగించిన వీరందరినీ తిరిగి మూడు రోజుల్లో అంటే ఈ నెల 28న యథాస్థానంలో రీఎంగేజ్ చేస్తూ 2025–26 విద్యా సంవత్సరానికి విధుల్లోకి తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేజీబీవీ ఉద్యోగుల రీఎంగేజ్ ఉత్తర్వులు వెలువడిన మరుసటి రోజు సమగ్ర శిక్ష ఉద్యోగుల రీఎంగేజ్ ఉత్తర్వులు వెలువడటంతో ఉద్యోగులు ఊపిరిపీల్చుకున్నారు. డీపీవో సిబ్బంది 9 మంది, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు 22 , డాటా ఎంట్రీ ఆపరేటర్లు 29 , ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్లు 49 , క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్పీ) 94 , డీఎస్ ఎంటీలు, మెసేంజర్లు 19, సిస్టమ్ అనాలసిస్ట్, ఏపీవో, అకౌంటెంట్, ఇద్దరు డిస్ట్రిక్ టెక్నికల్ పర్సన్స్, సీజీవీలు 19 మంది, ఇద్దరు నైట్ వాచ్‌మెన్లు విధులు నిర్వహిస్తున్నారు. కాగా, 88 మంది పీటీఐలను మాత్రం రీఎంగేజ్ చేసే విషయమై రాష్ట్ర అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వెలువడలేవు.

అగ్రిమెంట్‌తో విధుల్లోకి..

సమగ్ర శిక్ష పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో ఉన్నతాధికారుల సూచనల ప్రకారం అగ్రిమెంట్ చేసుకొని తిరిగి విధుల్లోకి చేర్చుకుంటాం. వారు విధులు నిర్వహిస్తున్న అధికారి నుంచి పనితనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. – అశోక్, డీఈవో

ఆదర్శప్రాయుడు బుద్దె రాజేశ్వర్





బుద్దె రాజేశ్వర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, కుటుంబసభ్యులు, సాలూర బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన రాజేశ్వర్ విగ్రహం

- ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

బోధన్ : తుదిశ్వాస వరకు ప్రజలకు సేవలందించిన దివంగత బుద్దె రాజేశ్వర్ ఆదర్శప్రాయుడని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బోధన్ మాజీ ఎంపీపీ బుద్దె సావిత్రి భర్త సీనియర్ నేత బుద్దె రాజేశ్వర్ సాలూర గ్రామాభివృద్ధికి, ప్రజా సేవలకు జ్ఞాపకార్థంగా గ్రామస్తులు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రాజేశ్వర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజేశ్వర్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని వివరిస్తూ పోచారం శ్రీనివాస్ రెడ్డి భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. సర్పంచ్, ఎంపీటీసీ, సొసైటీ చైర్మన్ పదవుల్లో సుదీర్ఘకాలంపాటు బాధ్యతలు నిర్వర్తించిన రాజేశ్వర్ తన వద్దకు ప్రజా సమస్యల పరిష్కారం కోసమే వచ్చేవారని, ఏనాడూ వ్యక్తిగత పనులు కోరలేదన్నారు. రైతుల చిరకాల వాంఛ అయిన మంజీర నదిపై ఎత్తిపోతల పథకాన్ని పట్టుబట్టి సాధించాడని, ఆ ఎత్తిపోతల పథకానికి బుద్దె రాజేశ్వర్ పేరు పెట్టాలని సమష్టి ఆమోదంతో తీర్మానించాలని గ్రామస్తులను కోరారు. స్థలదాత ఇల్తెపు బొర్ర గంగారాం, విగ్రహదాత మిద్దెల రాజును ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో రాజేశ్వర్ సతీమణి బుద్దె సావిత్రి, బోధన్, కోటగిరి ఏఎంసీ చైర్మన్లు చీల శంకర్, హన్మంతు, ఏసీపీ శ్రీనివాస్, టీపీసీసీ డెలిగెట్ బీ గంగాశంకర్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సింగాడే పాండు, బీఆర్ఎస్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోగినేని నరేంద్రబాబు, మందర్నా రవి, పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్, కోటగిరి మాజీ జడ్పీటీసీ హెగ్డోలి శంకర్, నాయకులు అల్లె రమేశ్, గణపతి రెడ్డి, బిల్ల రాంమోహన్, డాక్టర్ కొలయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీరులు.. అవుతారా?

- నేరుగా భారత సైన్యంలో చేరే అవకాశం
- దరఖాస్తుకు రేపే చివరి తేదీ



www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలి.

ఖలీల్‌వాడి: త్రివిధ దళాల్లో చేరాలనే ఆసక్తి ఉన్న యువకులను ఇండియన్ ఆర్మీ ప్రోత్సహిస్తోంది. అగ్నిపథ్ పథకంలో భాగంగా ప్రతి సంవత్సరం రెండుసార్లు అగ్నివీర్ ఎంపికలు నిర్వహిస్తోంది. అగ్నివీరులుగా ఎంపికైన వారికి నాలుగేళ్లపాటు ఐదంకెల వేతనం అందిస్తోంది. అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య పెరుగుతుండడంతో గడువు తేదీని పొడిగించింది. అయితే ఈ ఉద్యోగం సాధించేందుకు గల అర్హతలు, ఫిజికల్ టెస్ట్, రాత పరీక్ష వివరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

అర్హతలు:

- ■ అభ్యర్థుల వయస్సు 17.5 నుంచి 21 సంవత్సరాల వరకు ఉండాలి. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించాలి.
- ■ ఫిజికల్ టెస్ట్‌లో 1600 మీటర్ల పరుగు, పుల్ అప్స్, జిగ్‌జాగ్ బ్యాలెన్సింగ్, డిచ్ పరీక్షల్లో అర్హత సాధించాలి.

పరుగు పందెం..

అగ్నివీర్‌కు మొదటి పరీక్ష పరుగు పందెం. 1600 మీటర్ల పరుగును 5 నిమిషాల లోపు, అంతేకంటే తక్కువ సమయంలో పూర్తి చేయాలి. ఒకేసారి 300 మందికి పోటీ నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఫెయిల్ అయితే మిగితా పరీక్షలకు అవకాశం ఉండదు.

జిగ్ జాగ్ బ్యాలెన్సింగ్, డిచ్ :

- ■ పొడవుగా వంకర టింకరగా ఉన్న కర్ర(చెక్క)పై అభ్యర్థులు కిందపడకుండా నడుచుకుంటూ ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. దీనినే జిగ్ జాగ్ బ్యాలెన్సింగ్ అంటారు. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసంతోనే ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడానికి అవకాశం ఉంటుంది.
- ■ పరుగెత్తుకుంటూ వచ్చి తొమ్మిది మీటర్ల గుంత అవతలి వైపు దూకాలి. దీనినే డచ్ పరీక్ష అంటారు. దీనికి కసరత్తు చేయాల్సి ఉంటుంది.

పుల్ అప్స్

ఈ పరీక్షలో పాస్ కావాలంటే తప్పనిసరిగా 10 పుల్ అప్స్ తీయాల్సి ఉంటుంది. ఎక్కువగా తీస్తే బోనస్ మార్కులు కూడా వస్తాయి. ఈ పరీక్ష చేస్తున్నప్పుడు ఎంపిక చేసే అధికారులు అభ్యర్థి వైపు చూస్తూ గట్టిగా అరుస్తారు. భయపడకుండా శ్వాస తీసుకుంటూ పుల్ అప్స్ చేయాలి.

అర్హత పరీక్ష

ఎంపికైన అభ్యర్థులకు అర్హత పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఇండియన్ ఆర్మీ కార్యాలయం నుంచి సమాచారం అందుతుంది. సమాచారం అందుకున్నవారు అధికారులు సూచించిన పత్రాలతోపాటు మెడికల్ టెస్ట్‌కు హాజరుకావాల్సి ఉంటుంది. ప్రక్రియ పూర్తయిన తర్వాత అపాయింట్‌మెంట్ లెటర్ అందిస్తారు. దీంతో భారతసైన్యంలో సైనికుడిగా శిక్షణ తీసుకుంటారు.